# దైవము ఆత్మస్వరూపుడు

సత్యా మృతంబును చవి చూడకున్నచో
చెల్లునే నరుడన్న చెక్కబొమ్మ
ధర్మంబు నెఱుగక దనుజుండె యగుగాని
మానవుండెట్లగు మహిని పుట్టి
శాంతి చెందని జీవి శార్దూలమేగాని
మానవు డెట్లగు మనసు లేక
ప్రేమ లేకను జీవి బీటలు వారిన
మరు భూమియేగాని మనుజుడగునె

సత్య ధర్మ శాంతి ప్రేమ జగతి చక్కవెలయ
కాన నాలుగు గుణములు క్రమము తోడ
పట్టుదలతోడ సాధించి పరమభక్తి
పూర్ణ మానవత్వంబు పొందరయ్య

పుడమికి సరి మధ్య పుట్టపర్తి యనగను
ఆత్మవిద్య యందె అవతరించె
విశ్వమానవ కోటి విజ్ఞాన మందంగ
విశ్వ విద్యాలయ మిచట వెలసె
శాంతి సౌఖ్యములను సర్వదేశములందు
వెల్గు జల్లెడి నిగ్గు లిచ్చుట వెలసె
నియతి తప్పని మహా నిష్ఠులు భక్తులు

srisathyasaivachanamrutam

**వేలు లక్షలు కోట్లు వెలసి రిచట**

**సత్య ధర్మ ప్రేమ శాంతులు జగతికి**
**చాటి చెప్ప బూని సాయి ప్రభువు**
**సత్యసాయి భువిని సంపూర్ణ ప్రేమరూపి**
**యగుచు పుట్టె నిచట మోదమలర**

**ప్రేమ స్వరూపులారా!**

నితోవా ఇమాని భూతాని జాయంతి అని ప్రపంచమంతా కూడా పరమాత్మ నుండియే ఆవిర్భవించి, పరమాత్మునియందే నిలిచి కడకు పరమాత్మునియందు లయ మొందుతున్నది. అటులనే మానవుడు కూడా సంకల్పముల నుండే ఆవిర్భవించి, సంకల్పముల మీదనే జీవించి కడకు సంకల్పములందే లయమొందుచున్నాడు. ఎట్టి సంకల్పమో అట్టి నడత. ఎట్టి నడతయో అట్టి ఫలము. ఎట్టి ఫలమో అట్టి గమ్యము. సంకల్పములయొక్క ప్రభావమే జీవితముయొక్క ప్రధానము. కనుక ప్రతి మానవుడుకూడా ఉత్తమ సంకల్పములను అభివృద్ధి గావించుకొని, ఉత్తమ ఫలములనుభవించి, ఉత్తమ గమ్యమును చేరుటకై తగిన కృషి చేయాలి.

కంటికి కనిపించునది, చెవులకు వినిపించునది, తనువును కదలించునది, మనసును మరపించునది, హృదయమును వికసింప చేయునది ఈ జగత్తు. ఈ దృశ్య కల్పితమైన జగత్తునకు విశ్వము అని పేరు. విశ్వ+మ్ = విశ్వం. విశ్వమనగా వ్యాప్తి గావించునది. వ్యాప్తి గావించే తత్త్వమునకు విశ్వమని పేరు. విశ్వమును వ్యాప్తి గావించినవాడే విష్ణువు. విశ్వము కార్యము. విష్ణువు కారణము. కార్యకారణ సంబంధములు ఏకాత్మ భావముయొక్క స్వరూపములే. ఈ విశ్వమునకే విరాటుడని, వైశ్వానరుడని, వైరాగసుతుడని అనేక పేర్లతో ప్రకటితమవుతున్నాడు. నానా రూప నామములతో కూడిన ఈ జగత్తునకు విశ్వుడు అని పేరు. ఇతనే విరాట్ స్వరూపుడు.

ప్రతి జీవుని యందు నేను, నేను అని అభిమానము కలిగినటువంటి ఈ దివ్యతత్త్వమే వైశ్వానరుడు. విశేషముగా ప్రకటించే తత్త్వమునకే వైరాజసుతుడు అని. ఏతావాతా విశ్వమే విష్ణు స్వరూపము. వ్యాపకమైన గుణములు కలిగినవాడే విష్ణువు. మంచి గుణములకు మారు

sri sathyasai vachanamrutam

పేరే దేవుడు. భగవంతునకు ఐశ్వర్యమని, ధర్మమని, యశస్సని, సంపదయని, జ్ఞానమని, వైరాగ్యమని షడ్గుణములు కలవు. ఇక్కడ ఐశ్వర్యమనగా ఏమిటి? జ్ఞానమూ ఐశ్వర్యమే. ఆరోగ్యమూ ఐశ్వర్యమే. సిరి సంపదలు ఐశ్వర్యమే. ఆనందమూ ఐశ్వర్యమే. విద్యయూ ఐశ్వర్యమే. బలమూ ఐశ్వర్యమే. సర్వమూ ఐశ్వర్యమే. సకలైశ్వర్య స్వరూపుడే భగవంతుడు.

ఇంక ధర్మము. ఏమిటి ఈ ధర్మము? వ్యక్తి ధర్మము, సామాజిక ధర్మము, దేశ ధర్మము, విశ్వ ధర్మము, దేహ ధర్మము. ఇవన్నీ కూడా ధర్మముతో కూడినవే. అయితే ప్రధానమైన ధర్మములను రెండుగా విభజించారు. ఒకటి పరధర్మము. రెండవది స్వధర్మము. స్వధర్మమును అనేకమంది తప్పు అర్థము భావించి ఏదో కులధర్మంగా, మత ధర్మముగా విశ్వసిస్తూ వచ్చారు. క్షత్రియులకు క్షత్రియ ధర్మమని, వైశ్యులకు వైశ్యధర్మమని, బ్రాహ్మణులకు బ్రాహ్మణ ధర్మమని, శూద్రులకు శూద్ర ధర్మమని. ఇది సరియైన అర్థము కానేరదు. స్వ-ధర్మము అనగా ఆత్మధర్మమే. దీనిని అనుసరించటమే ప్రధాన కర్తవ్యము మానవునకు పర ధర్మమనగా దేహ ధర్మమే. బాహ్య సంబంధమైన జీవితంలో జీవనోపాధి నిమిత్తమై, జీవిత పరమావధిని లక్ష్యము నందుంచుకొని గావించు ఈ కర్మలన్నీ కూడా పరధర్మములే. పరధర్మమునందు భయభ్రాంతులు కూడి ఉంటాయి. దీనివలన జయాపజయములు కలుగునో ఏమో, లేక నింద నిష్ఠూరములు వచ్చునో యేమో ఇలాంటి సందేహములతో భయ భ్రాంతులతో జీవిస్తుంటాడు పరధర్మమునందు మానవుడు.

**ఆత్మధర్మము నసుసరించండి**

కాని స్వధర్మము ఆత్మధర్మమునందు ఇలాంటి భయభ్రాంతులకు అవకాశమే లేదు. కనుక ఆత్మ ధర్మము ననుసరించటమే మానవుని ప్రధానమైన కర్తవ్యము. కనుక ఇలాంటి గుణములన్నీ ప్రతి మానవునిలో ఉండటం చేత భగవంతుడు సర్వమానవ స్వరూపుడు కూడా. ఏకో వసి సర్వ భూతాంతరాత్మ. ఒక్కడే సర్వభూతములందు అంతరాత్మగా ఉంటున్నాడు. భగవంతుడు ఏదో ఒక ప్రత్యేకమైన స్థానమునందుగాని, ప్రత్యేకమైన కాలమునందుగాని, ప్రత్యేకమైన పరిస్థితులయందుగాని దర్శించుకోవటం కాదు. ఇలాంటి సద్గుణములు కలిగిన ప్రతి ఒక్కడూ కూడా భగవత్ స్వరూపుడే. ఇతనినే షట్కారుడు అని పిలిచారు పెద్దలు.

srisathyasaivachanamrutam

షట్కారుడనగా సృష్టిని గావించువాడు. సద్గుణములతో ప్రకాశించువాడు. సర్వత్రా వ్యాపించినవాడు. సకలైశ్వర్యములతో కూడినవాడు. సకల విషయములను గుర్తించినవాడు అన్నింటియందు ఉండికూడను, దానితో తనకేమాత్రము సంబంధము లేనివాడు. ఇలాంటి వాడే భగవంతుడు. ఇట్టి భగవంతుని ఎట్టి ప్రమాణముల చేతను గుర్తించుటకు సాధ్యం కాదు.

ప్రమాణములు మూడు విధములు. ప్రత్యక్ష ప్రమాణము, అనుమాన ప్రమాణము, శబ్ద ప్రమాణము. ఇవి కేవలం లౌకిక దృష్టితో మనం నిర్ణయించుకున్న ప్రమాణములు. భగవంతుడు సర్వవ్యాపి. సర్వభూతములందు ఉన్నవానికి ఎట్టి ప్రమాణమని నిర్ణయించగలరు? కనుకే భగవంతుని అప్రమేయుడు అని పిలుస్తూ వచ్చారు. అప్రమేయుడనగా ఎట్టి ప్రమాణములకు చిక్కనివాడు. భగవంతుడు గొప్ప మేధాశక్తి కలిగినవాడు. పరిపూర్ణ జ్ఞాన స్వరూపుడు. జ్ఞానమే తాను. అందువలనే అట్టి జ్ఞాన స్వరూపుడైన భగవంతుని మనువు అని పిలుస్తూ వచ్చారు. సమస్త జగత్తును సంకల్పముచేత సృష్టించి, పోషించి లయమొందింప చేయగల శక్తి సామర్థ్యములు కలిగినటువంటి వాడు. కనుకనే భగవంతుని ప్రజాపతియని మరొక పేరుతో పిలుస్తూ వచ్చారు. ఇట్టి పరమాత్ముని ఆత్మ అని కూడా తెలుపుతూ వచ్చారు. ఆత్మ అనగా బ్రహ్మనే. బ్రహ్మ అనగా సర్వజీవులయందు ఉన్న చైతన్యమే. ఆత్మ వేరు బ్రహ్మ వేరు కానేరదు. కనుక అట్టి చైతన్యము కలిగిన దివ్యత్వమునే పరమాత్మగా భావిస్తూ వచ్చారు.

**మహానుభావుడనగా భగవంతుడే**

ఈ బ్రహ్మతత్త్వమునే మరొక ప్రదేశంలో అహం అని ఉచ్చరిస్తూ వచ్చారు. అహం అనగా దేహ సంబంధమైన అహంకారం కాదు. దేదీప్యమానమైన ప్రకాశమునే అహం అని చెప్పుతూ వచ్చారు. అహం అనగా అంధకారమును నిర్మూలం గావించే స్వరూపమే. అహం అనగా సాక్షియని మరొక అర్థం. సర్వసాక్షియైన పరమాత్మనే అహం అని పిలుస్తూ వచ్చారు. పుట్టినదానికి పుట్టబోయే దానికి, ఉన్నదానికి ప్రభువైనవాడు భగవంతుడు. త్రికాలములందు శాశ్వతముగా మార్పు చెందని స్వరూపము కలిగినటువంటివాడు భగవంతుడు. అట్టి భగవంతుని భూత భవ్య భవత్ ప్రభువు అని కూడా పిలుస్తూ వచ్చారు. ఇలాంటి భగవంతుని యొక్క స్వరూపమును భావః అని కూడా చెబుతూ వచ్చారు. భావః అనేది కేవలం ప్రకాశ వంతమైనది. కనుకనే

srisathyasaivachanamrutam

ఇతనికి మహ–అను–భవ మహానుభావుడని పిలుస్తూ వచ్చారు. మహానుభావుడనగా ఏదో పెద్దలందరిని లోకరీతిగా మనం అనుకుంటూ ఉంటాము మహానుభావుడనగా భగవంతుడే. పరమాత్మకే ఈ పదము సరియైన సంబంధము కలిగి ఉంటుంది. అణువునందును, ఘనము నందును ఉండినటువంటి వానినే మహానుభావుడని అంటారు. ఇతనినే అణోరణీయాన్ మహతో మహీయాన్ మహా అనగా గొప్పది అణువు అనగా చిన్నది. ఈ రెండింటియందు కలవాడే మహానుభావుడు. కనుక సర్వత్రా ఉన్న దివ్యత్వాన్ని ఇట్టిది, అట్టిది అని వర్ణించుట కెవరికి వీలుకాదు. ప్రపంచమునందు ప్రతి పదార్థము నందు సత్ చిత్ ఆనందము అంతర్లీనమై ఉంటుంది. ఇంక రెండూ రూపము, నామము. ఈ సత్ చిత్ ఆనంద రూప నామములందు మొదటి మూడూ భగవంతుని స్వరూపములే. రూపనామములు నిరంతరము మార్పు చెందునవే. కనుక మార్పు చెందునవి ప్రాకృత స్వరూపములు.

ఈ మార్పు చెందే ప్రాకృత స్వరూపములన్నీకూడా శాశ్వతమై నిత్యమైన సత్ చిత్ ఆనందములలో లీనమై ఉంటున్నాయి. ఈ సత్ చిత్ ఆనందమే మానవుని నిజ స్వరూపము. కానీ తన స్వరూపాన్ని విస్మరించి, బాహ్యమైన అనిత్యమైన, అశాశ్వతమైన, మార్పు చెందే రూపనామములనే తాను సత్యమని భావించి తద్వారా తన జీవితాన్ని కొనసాగిస్తూ వస్తున్నాడు. మొదటి సత్ చిత్ ఆనందములు మూడు కూడను నిత్యమైనవి కనుకనే సత్యం అని కూడా పిలుస్తూ వచ్చారు. భగవంతునికి సత్య అనేది కూడా ఒక పేరు. భగవంతుని యందున్న సమస్త విచారములు కూడా ప్రతి మానవుని పోల్చుకుంటూ వస్తున్నవి. ప్రతి మానవుడు భగవత్ స్వరూపుడే. ప్రతి పదార్థం కూడా భగవత్ స్వరూపమే. ఈ భగవత్ స్వరూపము కానిది ఈ విశ్వములో కానరాదు.

**హరి మయము విశ్వమంతయు**
**హరి విశ్వమయుండు సంశయము పని లేదా**
**హరి మయము గాని ద్రవ్యము**
**పరమాణువు లేదు పరికించినచో**

భగవంతుని గురించి చక్కగా వివరించి తెలుపమని ప్రసాద్ కోరినాడు. కొందరు లేదు లేదు అంటారు. మరికొందరు లేదు ఉన్నది అంటారు. ఇంకామరి కొందరు ఉన్నది ఉన్నది అంటారు.



srisathyasaivachanamrutam

ఉన్నది ఉన్నది అనే వారికి ఏమున్నదో వారికే తెలియదు. లేదు లేదు అనేవారికి ఏది లేదో వారికి తెలియదు. ఉన్నది లేదు అనేవారికి రెండూ తెలియదు. ప్రాచీన కాలము నుండి ఉన్నది అనేవారికి ఆస్తికులని, లేదు అనే వారిని నాస్తికులని, ఉన్నది లేదు అనే వారిని ఆస్తిక నాస్తికులని పిలుస్తూ వచ్చారు. ఆస్తికులు నాస్తికులు పేర్లు వ్యత్యాసమేగాని ఇరువురు ఒక్కరే. నాస్తికులనగా ఒక మొగ్గ. ఆస్తికులనగా విచ్చిన పువ్వు. విచ్చిన పువ్వు తనయొక్క సుగంధమును అనేక మందికి అందించి ఆనంద పరుస్తుంది. విచ్చని మొగ్గ తనయొక్క పరిమళాన్ని ఎవరికీ అందించదు. ఈ మొగ్గ ఏనాటికైనా విచ్చిన పూవుగా మారవచ్చును. లేక విచ్చక పూర్వమే రాలిపోవచ్చును. దివ్యత్వాన్ని లోకానికి అందించేవారు ఆస్తికులని, అట్టి దివ్యత్వాన్ని జగత్తుకు అందించనివారు నాస్తికులని చెప్తూ వచ్చారు. ఇప్పుడు ఈ టంబ్లరు టేబుల్‌పైన వుంది. ఈ టంబ్లరును చూసినటువంటి వారు, ఈ టంబ్లరు ఈ టేబిల్‌పైన ఉన్నది అని స్పష్టంగా చెప్పగలరు. ఇంక చూడనటువంటి వారు ఈ టంబ్లరు ఇక్కడ లేదు అని చెప్పవచ్చు. లేదు అనేవాడు కూడా పూర్వం టంబ్లరును చూసి ఉండాలి. ఉన్నది అనేవారు ముందుగా టంబ్లరు చూసి ఉండాలి. చూడని వానికి ఉన్నది లేదు అని చెప్పే అధికారం లేదు. ఇరువురూ కూడా టంబ్లరుయొక్క తత్త్వాన్ని చక్కగా గుర్తించినవారే. అదేవిధంగా భగవంతుడు లేదు లేదు అంటే ఏనాడో వాడు భగవంతుని చూసి ఉంటేనే ఇది లేదు అని చెప్పటానికి వీలవుతుంది. నిజంగా భగవంతునే తాను చూచి ఉండకపోతే దేనిని లేదు అని చెప్పగలడు? కనుక లేదని చెప్పేవాడు కూడా భగవంతుడు ఉన్నాడనే సత్యాన్ని గుర్తింప చేస్తున్నాడు.

**మాయ కేవలం భ్రమ మాత్రమే**

మానవత్వములో ఉండే దివ్యత్వాన్ని మాయ అనేది మరుగు పరుస్తూ వస్తున్నది. మాయ అనగా కేవలం ఒక భ్రమనే. ఇక్కడ పాము కాదు ఇది త్రాడు అని చెప్పటం కూడా పామునెప్పుడో చూసినప్పుడు, త్రాడును చూసినప్పుడే ఇది పాము కాదు త్రాడు అని చెప్పగలడు. మరొకడు ఇది త్రాడు కాదు పాము అని చెప్పాలంటే త్రాటిని, పామును రెండిటిని చూసి వుండాలి. రెండూ చూసినటువంటివాడే ఇది త్రాడు కాదు పామని, పాము కాదు త్రాడని రెండూ చెప్పటానికి వీలవుతుంది. అయితే పాముని చూసి త్రాడని, త్రాడును చూసి పామని చెప్పటం కేవలం

అక్కడే ఒక మాయ ఆవరిస్తుంది. ప్రకాశవంతమైన సమయములో త్రాడుని చూసి పామని ఎవ్వరూ చెప్పరు. ప్రకాశము లేక కొంచెం మబ్బుగా ఉన్న సమయమునందే ఇది పామో యేమో అని భయపడుతున్నాడు. తిరిగి లైట్ వేసినప్పుడు ఇది పాము కాదు త్రాడు అని నిర్ణయం చేసుకుంటాడు. అనగా జ్ఞానవంతుడు జ్ఞానము కలిగినవాడు పామును పాముగా త్రాడును త్రాడుగా నిర్ణయం చేస్తున్నాడు. జ్ఞానము లేనివాడు త్రాడును చూసి పామని, పామును చూసి త్రాడని భ్రమిస్తున్నాడు. ఈ జ్ఞానమే భగవంతుని యొక్క స్వరూపము. ఈ దివ్యభావము మానవునిలో ఆవిర్భవించినప్పుడే అతను సత్యమును సత్యంగా గుర్తించగలడు.

జగత్తులో అసత్యమనేది ఎక్కడా లేదు. సత్యముయొక్క అభావమే అసత్యము. ఇది ఒక భ్రమ మాత్రమే. కనుక సర్వత్రా నిండినది, సర్వత్రా ఉండినది, సర్వత్రా చరించేది, సర్వ జీవులలో భ్రమించేది, సర్వము కూడా బ్రహ్మమే. అయితే మానవుని దృష్టి ఒక సంకుచిత మార్గములో ప్రవేశించటం చేత ఇది అనేకత్వంగా గోచరిస్తోంది. ప్రపంచములో కనిపించే భేదములన్నీ ఆ భేద వస్తువుయొక్క అభివ్యక్తమే. ఫలము కావాలని ఆశించే వ్యక్తి, సంకుచిత హృదయుడైనప్పుడు కేవలం ఫలపుష్పాలు మాత్రమే దృష్టిలో ఉంచుకుంటాడు. కానీ విశాల భావం కలిగిన వ్యక్తి చెట్టును, కొమ్మలను, ఆకులను, బెరడును, వేర్లను అన్నింటిని లక్ష్యము నందుంచుకొని పోషిస్తాడు. కనుక ఫలము నాశించే వ్యక్తి చెట్టును, కొమ్మలను, చెట్టు ఆకులను, చెట్టు బెరడును అన్నింటిని కూడా పోషించాలి. అటులనే జ్ఞానమనే ఫలమును మనం పొందాలనుకున్నప్పుడు దేహమనే వృక్షమును, ఇంద్రియములనే కొమ్మలను, భావములనే ఆకులను సరియైన రీతిలో మనము పోషించుకోవాలి. ఇవి సరియైన మార్గములో ఉంచుకునే నిమిత్తమై నవ విధములైన భక్తులను మనము అలవరచు కొంటున్నాము. అవియే శ్రవణం, కీర్తనం, విష్ణు స్మరణం, పాద సేవనం, వందనం, అర్చనం, స్నేహం, ఆత్మ నివేదనం. ఈ నవవిధ మార్గములు కూడా మనము సక్రమమైన మార్గములో అనుసరించినప్పుడే ఫలము పొందటానికి అర్హులమవుతాము. అయితే ఈ కర్మలన్నీ చేసే పని ఏమిటి? ఈ సమస్త కర్మలు చిత్తశుద్ధిని గావిస్తున్నాయి. చిత్తశుద్ధి వలన జ్ఞానసిద్ధి లభ్యమవుతుంది. జ్ఞానసిద్ధివలన నిజ స్వరూపాన్ని పొందగలం. కైవల్యమనిగాని, కైలాసమనిగాని, నరకమనిగాని ప్రత్యేకమైన ఒక ప్రదేశంలో లేవు.

srisathyasaivahini.org

**పాప మనగ వేరు పరదేశమున లేదు**
**తాము చేయు పనుల తగిలి యుండు**
**దేవుడనగ వేరు దేశమందున లేదు**
**తాము చేయు పనుల తగిలియుండు.**

కనుక పాపముగాని పుణ్యముగాని మన కర్మల లోపలనే ఇమిడి ఉంటున్నాయి. ఐతే సర్వకర్మ భగవత్ ప్రీత్యార్థంగా మనం ఆచరించినప్పుడు సర్వకర్మలూ పవిత్రంగా రూపొందుతాయి.

దివ్యాత్మస్వరూపులారా! అందరియందు ఈ దివ్యమైన ఆత్మ ఉన్నదనే సత్యాన్ని గుర్తించాలి. ఆత్మ అనగా బ్రహ్మనే. మీరందరు బ్రహ్మస్వరూపులే. బ్రహ్మమనగా చైతన్యమే. చైతన్యము లేని తత్త్వము జగత్తులో కానరాదు. కనుక అట్టి చైతన్యమే దైవత్వముగా భావించి, నిరంతరము లక్ష్యమునందుంచుకొని, పారమార్థిక దృష్టితో ప్రాకృతమైన జీవితాన్ని మనం అనుసరించాలి. ఇలాంటి జగత్తునకంతా సృష్టి కర్త ఒక్కడే. అతనే బ్రహ్మతత్త్వము. సర్వత్రా ఉండు సత్యమే భగవంతుడు. మార్పు చెందేవన్నీ కూడా ఈ దేహములే. మార్పు చెందే దేహముల నాధారంగా తీసుకుని మార్పు చెందని దివ్యత్వాన్ని మనము అనుభవించాలి. ఈ అనేకత్వమంతా కూడను ఏకత్వం మీదనే ఆధారపడి ఉంది. దీనినే విప్రులు ఏకం సత్ విప్రా బహుధా వదంతి. ఉన్నది ఒక్కటే అయినా అనేక రూపములుగా దానిని వర్ణిస్తూ వచ్చారు.

## దేహమే దేవాలయం

ప్రేమస్వరూపులారా! పరమాత్ముని యొక్క తత్త్వమనే చైతన్యమును మనం మరువరాదు. భౌతికమైన విద్యలుగాని, భౌతికమైన అధికారాలుగాని, భౌతికమైన భోగభాగ్యములుగాని ఎంతకాలం మన దగ్గర ఉండగలవు? ఇవన్నియు మార్పు చెందునవే. అనుభవించే దేహం కూడా మార్పుచెందేదే. మార్పుచెందే వస్తువులు, మార్పుచెందే దేహమునకు మార్పు చెందని ఆనందాన్ని ఎలా అందించగలవు? కనుక మార్పు చెందని ఆత్మతత్త్వమే మార్పు చెందని ఆనందాన్ని నీకు అందిస్తుంది. అట్లని భౌతిక జీవితాన్ని మనం వదలరాదు. భౌతిక జీవితం కేవలం జీవనోపాధికై కాక, జీవిత పరమార్థాన్ని లక్ష్యమునందుంచుకుని జీవించటానికి ప్రయత్నించటమే మోక్షమార్గము. మనం చేసే ప్రతి కర్మ కూడా భగవత్ కర్మగానే భావించాలి.

ఈ దేహమనేది దేవునకు దేవాలయము. అయితే ఈ దేవాలయము ఎదో ఒక ప్రదేశంలో ఉండేది కాదు. ఇది కదిలే దేవాలయము. ఇది ఎక్కడకు కదిలితే అక్కడికి దేవుడు వెళుతున్నాడు. దేవుడు లేని దేవాలయం ఉండనే ఉండదు. అది పాడు దేవాలయ మంటారు. దేవాలయమని చెప్పరు. ఆ పాడు దేవాలయమెప్పుడు? ఈ జీవుడు నశించినప్పుడే. అప్పుడు శవంగా ఉండినదే పాడు దేవాలయమంటారు. కానీ ఈనాటి మానవులు శివంగా ఉండి కూడా శవముగా మారిపోతున్నారు. కేవలం స్వార్థము, స్వప్రయోజనము నిమిత్తమై ఈ జీవితాన్ని అంకితం చేస్తున్నారు. స్వార్థ రహితమైన కర్మలలో ప్రవేశించి, పరార్థమైన దివ్యత్వాన్ని దృష్టియందుంచుకొని, దివ్యత్వాన్ని మనము అర్థం చేసుకోవాలి. కనుక దైవమనేది ఏదో ఒక ప్రత్యేకంగా లేదని, ఆ దైవము మనయందే వున్నాడని, మనమే దైవస్వరూపులమని ఈ సత్యము యొక్క స్థితిని గుర్తించుకునే స్థాయికి చేరాలి. మొట్టమొదట మనము సరియైన కర్మలాచరించాలి. ఈ కర్మలను గుర్తించుకునే స్థాయికి చేరాలి. మొట్టమొదట మనము సరియైన కర్మలాచరించాలి. ఈ కర్మలకు సరియైన భావం మనము అభివృద్ధి పరచుకోవాలి. సంకల్పములు మంచివైనప్పుడే మన జీవిత ఫలం మంచిదిగా ఉంటుంది.

ప్రేమస్వరూపులారా! దుస్సంకల్పములుగాని, దురాలోచనలకు మనం ఏమాత్రం అవకాశము ఇవ్వక సత్సంకల్పములను, సదాలోచనలను మనం పోషించుకోటానికి ప్రయత్నించాలి. దైవకార్యాలలో మన కాలాన్ని అమితంగా వినియోగించుకోవాలి. కాని ఇట్టి దానికి మానవుడేమాత్రము ఉత్సాహ ప్రోత్సాహముల నందించటం లేదు. దినమునకు యిరువది నాలుగు గంటలున్నాయి. యిరువది మూడు గంటల యాభై ఐదు నిముషాలంతా స్వార్థమునకు ఉపయోగించుకొని కించిత్తైనా సుఖమునుగాని శాంతినిగాని పొందలేక పోతున్నాడు. ఇంక ఉన్న ఐదు నిముషములలో తెల్లవారి ఒక నిముషము, మధ్యాహ్నం ఒక నిముషము, సాయంత్రం మూడు నిముషములు, ఈ ఐదు నిముషములలో ఇంత ఫలితం కావాలని ఆశిస్తున్నాడు. ఒక్కసారి నమస్కారం చేసినంత మాత్రమున ఫలము లభించదు. ఆ నమస్కారం కూడా పవిత్ర భావముతో చేయి. నమస్కారం చేయకపోయినా ఫరవాలేదు ఫలితం లభిస్తుంది.

ఈ నమస్కారంయొక్క అంతరార్థమును కూడా మనం గుర్తించాలి. నమస్కారమనగా

ఈ ఐదువేళ్లూ, ఈ ఐదువేళ్లూ రెండింటినీ చేర్చి పదివేళ్లు ఏకం చేయాలి. ఐదు కర్మేంద్రియములు, ఐదు జ్ఞానేంద్రియములు ఏకం గావించినప్పుడే అనేకత్వములోని ఏకత్వములోనే భగవంతుని అనుగ్రహం మనకు ప్రాపిస్తుంది. ఇట్లు భావములను మనం ఏకం చేయక వేళ్లను మాత్రమే ఏకం చేస్తున్నాము. ఈ నమస్కారము కూడా వినయ విధేయతతో సరియైన విచక్షణా భావంతో చేయాలి. కొంతమంది ఈ గుంటూరు బెజవాడ వైపు వెడితే నమస్కారమండి అంటారు. ఏమిటో అది. ఆ నమస్కారం కూడా కొట్టే విధంగా ఉంటాయి. ఇలాంటి పదములు, ఇలాంటి భావములు, ఇలాంటి ప్రవర్తనతో మనం నమస్కారం చేసి ప్రయోజనమేమిటి? ఇది కేవలం ఒక విధమైన దురాచారంగా మారింది. హృదయభావం చేత, మానసిక సంతృప్తి చేత చిత్తశుద్ధిగా నమస్కారం చేయాలి. సర్వులయందు ఉన్న ఆత్మస్వరూపుడు పరమాత్ముడు అతనికే నేను నమస్కరిస్తున్నాను. చేసే నమస్కారమూ పరమాత్ముడే అందుకునే నమస్కారము పరమాత్ముడే. ఎవరైనా మనల గురించి దుర్భాషలాడితే అప్పుడు కూడా నీవు నమస్కారం చేసుకొని ఈ పరమాత్మున్ని ఆ రూపంలో ఆ పరమాత్ముడు దుర్భాషలాడుతున్నాడనే ఏకత్వాన్ని నీవు భావించు. ఎంత పవిత్రంగా సమత్వ మేర్పడుతుంది? కనుక ఏది ఇచ్చినా అది పరమాత్ముని ప్రసాదమే. ఏ సమయములో ఏది ఏ విధంగా లభిస్తుందో అది చెప్పటానికి వీలుకాదు. కనుక సర్వం భగవత్ప్రీత్యర్థం అని భావించాలి. దీనికి సేవలలో పాల్గొనండి. భగవత్కార్యములలో అమితంగా మీ కాలాన్ని ప్రవేశపెట్టండి. నిరర్థకమైన వానిలో మనం ప్రవేశించి కాలం వ్యర్థం గావించకండి. భగవన్నామము కూడా అత్యవసరం. నామస్మరణ చేస్తూ కరములచే కర్మలాచరిస్తూ హృదయంతో ఈ ఆనందాన్ని మనం గ్రోలాలి. ఈ మూడింటియొక్క ఏకత్వమే త్రికరణ శుద్ధి.

**(తేది. 23-11-1989న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vahanamrutam